

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

- హైకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తాం
- అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు 7వ పేజీలో...

28న జాతీయ లోక్ అదాలత్

జనగామ రూరల్, సెప్టెంబరు 10: ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జనగామ జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రవీంద్రశర్మ పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ సందర్భంగా మంగళవారం ప్రధాన న్యాయమూర్తి కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రవీంద్ర శర్మ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సీ.విక్రమ్‌లు మాట్లాడారు. పలు విలువైన అంశాలపై చర్చించారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్ర రిషి తదితరులు పాల్గొన్నారు.

ఆపద వస్తే.. అంతేనా?



గతేడాది భారీ వర్షాలకు జలమయమైన నగరం



వరదల్లో మునిగిన ప్రాంతాల నుంచి బాధితులను తీసుకువస్తున్న రెస్క్యూ సిబ్బంది (ఫైల్)

- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఉమ్మడిజిల్లా అతలాకుతలం
- గోదావరి వరదలతో ఏజెన్సీలో భయం భయం
- సకాలంలో సాయం అందక గాలిలో కలుస్తున్న ప్రాణాలు, నీటి పాలవుతున్న ఆస్తులు
- వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ ఏర్పాటుకు డిమాండ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)


ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఓరుగల్లు అల్లాడుతోంది. సకాలంలో సహాయక చర్యలు అందకపోతుండటంతో అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతుండగా.. రూ.కోట్ల విలువైన ఆస్తులు నీటిపాలవుతున్నాయి. విపత్తు కాలంలో అండగా నిలిచే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) సేవలకు వరంగల్ దూరమవడమే ఇందుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఉండగా, ప్రాంతీయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఆపద వచ్చిన సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గోదావరి పరివాహక ప్రాంతాలకు, వరంగల్ మహానగరానికి సకాలంలో చేరుకోలేకపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) సేవలు అందిస్తుండగా, వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఎన్‌డీఆర్ఎఫ్ సేవలు ఎక్కడ?

ఏటా విపత్తులతో భారీగా ప్రాణనష్టం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ఏర్పాటుకు చొరవ చూపటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్‌డీఆర్ఎఫ్ 16 బెటాలియన్లను ఏర్పాటు చేసింది. వీటిలో నాలుగింటిని 2018లో ఏర్పాటు చేయగా ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఏర్పాటు చేశారు. ఈ బెటాలియన్‌లో అత్యవసర పరిస్థితుల్లో పని చేయటానికి 18బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఏపీలోని కృష్ణా జిల్లాలో 12, విశాఖపట్నంలో రెండు, బెంగళూరులో రెండు, హైదరాబాద్‌లో ఒక బృందాన్ని ప్రాంతీయ ప్రతిస్పందన కేంద్రానికి (ఆర్ఆర్‌సీ)లో నియమించారు. తెలంగాణలో కేవలం ఒకే బృందం ఉండటంతో ఆపద సమయంలో ఢిల్లీ, విజయవాడల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు, గోదావరీతీర ప్రాంతానికి రప్పించుకోవాల్సి వస్తుంది. వీటి అనుమతులకు గంటల సమయం పడుతుండటంతో ఆపదలో పూర్తిగా సాయం అందటం లేదు. ప్రతిఏటా ఎక్కడో ఒకచోట విపత్తులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీలో అమాయక రైతులు వాగులు, వరదల్లో చిక్కుకపోయి అవస్థలు పడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. భూపాలపల్లి సింగరేణి రెస్క్యూ టీమ్‌ను అపద సమయంలో అత్యవసరంగా వాడుకునే వారు. అయితే సింగరేణి కాకుండా ఇతర చోట్ల జరిగే ప్రమాదాల్లోకి రెస్క్యూ టీమ్ వెళ్లకుండా కొంతవరకు ఆంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో సింగరేణి రెస్క్యూ టీమ్ సేవలు అరుదుగా మారాయి. ఇక వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో డీఆర్ఎఫ్ టీమ్‌ను స్థానికంగా ఏర్పాటు చేసి, వరదల సమయంలో నగరవాసులకు సాధ్యమైనంత వరకు సేవలు అందిస్తున్నా.. ఎన్‌డీఆర్ఎఫ్‌కు ఉన్న సామర్థ్యం ఆ బృందాలకు ఉండే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ ఏర్పాటు చేస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ లభిస్తుందనే చర్చ జరుగుతోంది.



ఈనెల 1న మహబూబాబాద్ శివారు రాళ్లవాగులో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న హైదరాబాద్ రెస్క్యూ బృందం



భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక శివారు మోరంచ బ్రిడ్జి పనులు చేస్తూ వరదలో చిక్కుకుపోయిన ఆరుగురు కూలీలను కాపాడడానికి వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్లు (ఫైల్)

ప్రతీ ఏడాది విపత్తులతో విలవిల..

గోదావరితీరంలో ప్రతీ ఏటా వచ్చే విపత్తులతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అతాలకుతలం అవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా క్లౌడ్ బరస్ట్‌లు, టోర్న డోలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఏర్పడు తున్నాయి. వాతావరణ మార్పులతో ప్రకృతి కన్నెర్ర చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. 2020 ఆగస్టు 15న భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి సమీపంలోని చలివాగులో 12మంది రైతులు చిక్కుకు పోయారు. వాగులో చిక్కుకున్న రైతులను 8గంటల అనంతరం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆ రైతులను బయటకు తీసుకొచ్చారు. 2023 జూలై 27వ తేదీన భారీ వర్షాలకు భూపాలపల్లి, ములుగు జిల్లాలో 20మందికి పైగా వరదలో గల్లంతయి మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా మోచంవాగు ఉధృతంగా ప్రవహించడంతో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక శివారు మోరంచపై బ్రిడ్జి పనులు చేస్తున్న అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు కూలీలు వరదలో చిక్కుకున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం

మిగతా 7వ పేజీలో..

బుగులు వేంకన్నకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిలుపూర్, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ప్రతీ మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూ 40 లక్షల విలువ గల 108 స్వర్ణాలతో (బంగారం) స్వామివారి పాదాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి హాజరైన భక్తుల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ నేతృత్వంలోని పూజారుల బృందం ప్రత్యేక పూజలు జరిపించారు, పూజా విశిష్టతను గూర్చి భక్తులకు వివరించడంతో పాటు, వారికి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు - కిరణ్మయి, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి దంపతులు ప్రత్యేక సేవా రుసుము చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె శేఖర్ పాల్గొన్నారు.

జనగామకు నువ్వే బాస్.. డోంట్‌వర్రీ!

డీసీసీ పగ్గాలు నీవే అంటూ కొమ్మూరికి పలువురు కీలకనేతల భరోసా

నియోజకవర్గ నేతల ఊహాగానాలకు చెక్



రెవెన్యూ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

8లో

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- చదువు, వైద్యానికి ప్రభుత్వాలు ప్రాధాన్యమివ్వాలి
- రఘునాథ్‌పల్లిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



జఫర్‌గడ్ మండలం రఘునాథ్‌పల్లిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, సెప్టెంబరు 10 : విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్‌గడ్ మండలం రఘునాథ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక వాస్తవ్యులు కీసర భూపాల్‌రెడ్డి - జయలక్ష్మీ దంపతులు సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని మంగళవారం ఎమ్మెల్యే శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పాము సదాశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కడియం మాట్లాడుతూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యం, విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయి ంచకపోవడం, సముచిత ప్రాధాన్యత నివ్వకపోవడం వల్ల పేదలకు నాణ్యమైన విద్యనందడం లేదన్నారు. దెబ్బతిన్న బీటీ రహదారిని వెంకటాపూర్ క్రాస్ నుంచి రఘునాథ్‌పల్లి, కూనూరు, కోనాయిచలం మీదుగా జఫర్‌గడ్ వరకు వచ్చే వేసవి నాటికి నూతనంగా డబుల్ రోడ్డును నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే నోటు బుక్కులను అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని నిర్వాహకులు, నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, మాజీ ఎంపీపీలు కట్టా మనోజ్‌రెడ్డి, అయోధ్య, సుదర్శన్, మాజీ సర్పంచ్‌లు బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి, కోల కృష్ణమూర్తి, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం గొప్పది

- ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, సెప్టెంబరు 10 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చాకలి ఐలమ్మ పోరాటం గొప్పదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ 39 వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. శౌర్య యాత్రపాలకుర్తికి చేరుకోగా ఈ సంరర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో పాటు ఐలమ్మ వారసులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ ప్రాంతానికి ఐలమ్మ స్పూర్తితోనే సేవా కార్యక్రమాలు చేసేందుకు అమెరికా నుంచి ఇక్కడి వచ్చామని అన్నారు. ఆమె పుట్టిన గడ్డపై ఎమ్మెల్యేగా ఉండడం గర్వంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని ముఖ్యమంత్రి రేవంత్‌డ్డి ప్రభుత్వం అధికారింగా నిర్వహిస్తుందని అన్నారు. విస్నూరు దేశ్‌ముఖ్‌కు ఆగడాలకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం చేసిందని గుర్తు చేశారు. కాగా ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శించిన వీధినాటిక ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి సింగరాపు రమేష్, మాచెర్ల సారయ్య బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి, చిట్యాల సోమన్న, ఐలమ్మ వారసులు చిట్యాల రాంచంద్రం, యాకయ్య, రాపర్తి మంజుల, చిట్యాల భారతమ్మ, పద్మ, మంగేశ్వరీ, సంపత్, శ్వేత ఉన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అధికారులు

ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం : దొరల ఆగడాలను ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో జరిగిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలామల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహాలకు సంబంధించిన మహనీయుల చరిత్ర కంటే వీరనారి చాకలి ఐలమ్మ చరిత్ర ఏమాత్రం తీసిపోదన్నారు. అన్యాయాన్ని ఎదిరించేందుకు కాకతీయులపై సమ్మక్క సారలమ్మలు తిరుగుబాటు చేశారని, కోతకువచ్చిన పంటను దోపిడీ చేసేందుకు సిద్ధపడ్డ దొర విస్నూర్ దేశ్‌ముఖ్‌పై తెగువను ప్రదర్శించిన చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్పూర్తిదాయకమన్నారు. రజకుల హక్కుల కోసం వాళ్లు చేసే పోరాటానికి తన మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర నాయకులు ఏదునూరి వీరయ్య, మండల అధ్యక్షుడు దీకొండ రాజు, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, లొక్కుంట్ల ప్రవీణ్, కొల్లూరి శివకుమార్ పాల్గొన్నారు.



పాలకుర్తిలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి , సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

నివాళి అర్పించిన కలెక్టర్ రిజ్వాన్

జనగామ రూరల్ : భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. చాకలి ఐలమ్మ(చిట్యాల ఐలమ్మ) 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమా ల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, డీఆర్‌డీవో వసంత, ఏవో రవీందర్, జిల్లా అధికారులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం రజక సంఘం అధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు జక్కుల అనిత వేణుమాధవ్, మంత్రి సుమలత శ్రీశైలంలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెన్నం సత్య నిరంజన్‌రెడ్డి, జాయ మల్లేష్, పులివెందుల శివకుమార్, పులివెందుల కృష్ణ ఉల్లెంగుల నర్సయ్య, రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మడికొండ, సెప్టెంబరు 10 : కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెరువు కట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రాయికంటి మొగిలి(64) కుంటుబ అవసరాల కోసం లోన్ ద్వారా అప్పు తీసుకున్నాడు. డబ్బులను కొంత మందికి అప్పుగా ఇస్తూ ఖర్చు చేస్తుండగా పిల్లల చదువుల కోసం తీసుకున్న డబ్బులు ఇతరులకు ఇస్తూ ఇలా ఖర్చు చేస్తే ఎలా అని భార్యా భర్తలమధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన మొగిలి.. మంగళవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుమారులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ మృతి

కాజీపేట, సెప్టెంబరు 10: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన వరంగల్ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, ముదిరాజ్ సంఘం నేత దండబోయిన సారయ్య(67) ముదిరాజ్ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంచిర్యాల, సుల్తానాబాద్, వరంగల్, ప్రభుత్వ ఐటీఐలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. భౌతికకాయాన్ని ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసంలో మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, జిల్లా నాయకులు పెండ్యాల సారంగపాణి, డి. లక్ష్మీనారాయణ తదితరులు దర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంఘం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. సారయ్య అంత్యక్రియలు బుధవారం హనుమకొండ పద్మాక్షిశ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.15వేల విలువ కలిగిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని జయ బాలాజీ కిరాణం షాపు యజమాని హరితేజ వద్ద రూ.10,250, సిగరెట్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కృష్ణ వద్ద రూ.5వేల విలువకలిగిన గుట్కాను పట్టుకున్నారు. ఇద్దరిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

చెన్నై సదస్సులో ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: సెప్టెంబరు 2 నుంచి 7 వరకు చెన్నైలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 18వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ థర్మల్ ఎనిలిసిస్ అండ్ కాలోరిమెట్రీ 2024 సదస్సుకు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న హాజరయ్యారు. థర్మోడినమిక్ అండ్ డీఎఫ్‌టీ స్టడీస్ బిట్‌విన్ 1, 2 ఇథియలిడిమిక్ అండ్ 1,5 పెంటనిడిల్ ఎట్ టీ293.15 టూ 313.15కే అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి సైంటిస్టులు పాల్గొన్న ఈ సదస్సులో సవితాజ్యోత్స్న టెక్నికల్ సెషన్‌కు అధ్యక్షులుగానూ వ్యవహరించారు.

రేపు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

మడికొండ, సెప్టెంబరు 10: వరంగల్ రీజియన్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 12న మడికొండ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు డీసీవో దాసరి ఉమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల కులము, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు నేరుగా మడికొండ గురుకుల పాఠశాలకు రావాలని తెలిపారు. ఎంట్రెన్స్ రాసిన హాల్‌టికెట్ వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 99498 92426, 76809 06134 నంబర్లలో సంప్రదించాలని డీసీవో కోరారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: ఇంటర్‌లో ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు ఎ.గోపాల్, డాక్టర్ జి.సుమన్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిర్దేశించిన ప్రవేశాల గడువు ఈ నెల 7తో ముగియగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ నెల 15 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు బోర్డు అధికార వర్గాలు ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికీ ఇంకా ప్రవేశాలు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్సు దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లోని శివసాయి కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, ఓ విటుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వేలేరు మండలానికి చెందిన ఓ మహిళ శివసాయి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాలనుంచి మహిళలను తీసుకువచ్చి ఏడాదిగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కేయూ పోలీసులతో కలిసి మంగళవారం ఆ గృహంపై దాడి చేసి మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

కేయూ భూములపై అధికారుల విచారణ

● జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు ● నివేదిక అందజేయనున్న అధికారులు



వర్సిటీలో విచారణ చేస్తున్న విజిలెన్స్, ఇన్స్‌పోర్స్‌మెంట్ అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ భూకబ్జాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు రెవెన్యూ, సర్వే, మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీ భూములను అందినకాడికి అందినట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడావ్యక్తుల కబ్జాల బాగోతాలను ఆధారాలతో సహా బయటపెట్టేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీలోని కబ్జాలకు గురైన భూములను అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు చేపట్టారు. రెండు రోజుల విచారణలో భాగంగా తొలిరోజు మంగళవారం వర్సిటీ న్యూ పీజీ హాస్టల్ పక్కన బీసీ కాలనీలోని 229 సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టారు. మునిసిపల్ అధికారులు బీసీ కాలనీల్లోని పలువురికి భూ అక్రమణలపై నోటీసులు జారీ చేయడంతో వారు అధికారుల ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ నేతృత్వంలో వర్సిటీ భూముల పాత సర్వే రిపోర్టులు, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారుల వద్ద ఉన్న దస్తావేజులను పరిశీలించారు. వర్సిటీది మొత్తం ఎంత భూమి వుంది..? ఏ సర్వే నెంబర్‌లో ఉండేదని గుర్తించారు. అక్రమణలు ఎక్కడెక్కడ జరిగాయనే విషయంలో అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. వర్సిటీల్లో భూముల్లో నిర్మించిన అక్రమ భవనాలు, ఇతర కట్టడాలను గుర్తించారు. వర్సిటీలోని ఇంచు భూమి కూడా అక్రమణకు గురికావొద్దని విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలోకి వచ్చిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కలిసి వినతి పత్రాలను అందచేశారు.

నేడు అధికారుల నివేదికలు

కాకతీయ యూనివర్సిటీలోని భూ కబ్జాల పర్వాలపై మంగళవారం మొదటి రోజు విచారణ చేపట్టిన అధికారులు.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి నివేదిక రూపొందించనుంది. బుధవారం రెండో రోజు కూడా వర్సిటీలో భూ కబ్జాలపై విచారణ చేస్తారు. అనంతరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ, సర్వే అధికారులు కబ్జాలపై సమగ్ర నివేదికను రూపొందించి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డిలకు అందచేస్తారు. విచారణ అధికారుల నివేదిక ఆధారంగా వర్సిటీలో ప్రహారీ నిర్మాణం తొందరగా చేపట్టే అవకాశం ఉంది.

వర్సిటీ భూములను మింగేసే కుట్ర

కాకతీయ యూనివర్సిటీ భూములను మింగేసే కుట్రలో భాగంగానే వర్సిటీలో కబ్జాలపై ఉన్న భూముల రిపోర్టులను పక్కన పెట్టి మళ్లీ సర్వేల పేరుతో కుట్రలు పన్నారనే ఆరోపణలు వర్సిటీలో వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ భూముల కబ్జాల భాగోతాలపై గతంలో కలెక్టరేట్ ఉన్నతాధికారులు అధికారులు, వర్సిటీ పాలక మండలి సభ్యుల సమగ్రంగా వర్సిటీ భూముల దస్తావేజులను రెవెన్యూ సర్వేలు, రిపోర్టులను చూసి కబ్జాల పర్వాలపై సమగ్రమైన నివేదికలను అందచేశాయి. వర్సిటీ భూములు కబ్జాలకు గురయ్యాయనే విషయం అప్పట్లోనే ఆయా అధికారుల నివేదికలతో స్పష్టమైంది. అయితే అప్పటి వర్సిటీ మాజీ వీసీతోపాటు వర్సిటీలో పలుకుబడి కలిగిన అధికారులు ఆయా రిపోర్టులను కనీసం బయటికి తీయలేదు. కబ్జాలపై ఉన్నటువంటి సమగ్ర రిపోర్టులను అమలు చేయకుండా మళ్లిప్పుడు తాజాగా రెవెన్యూ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, మునిసిపల్ అధికారులందరితో సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలపై పేరుతో వర్సిటీ భూములపై అటలాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ చుట్టూ ప్రహారీ నిర్మాణానికి గతంలోనే వర్సిటీ అధికారులు రూ.10కోట్లు కేటాయించారు. పనులను మధ్యలో ఆపేసి భూముల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. భూములపై డబుల్ సర్వేలు చేపట్టి ఎవరిని కాపాడుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వర్చువల్ కేర్ విభాగంలో 50 ఖాళీలకు, ఎస్ బ్యాంక్‌లోని సీనియర్ ఆఫీసర్లు 20 ఖాళీలకు, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లోని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 20ఖాళీలకు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 30 ఖాళీలకు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ 20ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పాసైన 22 నుంచి 35 ఏళ్లలోపుగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

13న మినీ జాబ్ మేళా

హనుమకొండ జిల్లా ఎంప్లాయింట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వే టూ న్యూస్ వరంగల్, హనుమకొండలో సేల్స్ ట్రెయినీలు 15 ఖాళీలు, భారత్ ఫైనాన్షియల్ ఇన్క్లూషన్‌లో లోన్ ఆఫీసర్లు 40 ఖాళీలు, ఆదర్శ మారుతీ సుజుకీ ములుగురోడ్‌లోని షోరూమ్‌లో టెలీకాలర్లు, డ్రైవర్లు 5 ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించే జాబ్ మేళాలలో వారి సర్టిఫికెట్లతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

కేయూ దూరవిద్య పరీక్షల రీ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న బీఎల్ఐఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూతో పాటు ఇతర పరీక్షల రీ షెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం తెలిపారు. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్(ఎంఎస్‌డబ్ల్యూ), ఫైనల్ ఇయర్‌వైజ్, నాలుగో సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబరు 90న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అలాగే బీఎల్ఐఎస్సీ ఎక్స్ అభ్యర్థులకు 18 సెప్టెంబరు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోషల్ వర్క్స్ అభ్యర్థులకు కేయూక్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, బీఎల్ఐఎస్సీ అభ్యర్థులకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అన్నం వండలేదని తమ్ముడిపై దాడి



అమర్‌కు నర్సంపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 10 : అన్నం ఎందుకు వండలేదంటూ తోడబుట్టిన తమ్ముడిపై అన్న కత్తితో దాడికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని రాంనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన దుర్గం ధర్మి-శోభ దంపతులకు ఇద్దరు కుమారులు అమర్, దేవేందర్ ఉన్నారు. ధర్మి, శోభలు దంపతులు గతంలోనే మృతిచెందారు. అన్నదమ్ములు అవివాహితులు కాగా, ఓ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అమర్ మటన్ షాపులో గుమస్తాగా పనిచేస్తుండగా, దేవేందర్ భవన నిర్మాణ కార్మికుడిగా అప్పుడప్పుడు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం అమర్ పనిచేసే షాపు వద్దకు మద్యం మత్తులో ఉన్న దేవేందర్ వెళ్లి ఇంట్లో అన్నం ఎందుకు వండలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మాటామాటా పెరిగింది. అదే సమయంలో దేవేందర్ పక్కనే ఉన్న కత్తిని తీసుకొని దాడి చేయగా అమర్‌కు కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం ఎంజీఎంకు వైద్యులు రెఫర్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కళలను మరింత ఆదరించాలి

మయూరి నాట్య కళా వేడుకల్లో వేదాంతం రాధేశ్యామ్



మాట్లాడుతున్న కూచిపూడి నాట్యాచార్యులు రాధేశ్యామ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 10: విశ్వ జనీనమైన కళలను ఆదరిస్తూ కళాకారులను మరింతగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రఖ్యాత నాట్యాచార్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కూచిపూడి అగ్రహారానికి చెందిన డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నేత్రపర్వంగా జరిగిన మయూరి నాట్యకళా కేంద్ర 17వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ నటుడు, కళాకారుడు, రిటైర్డ్ విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాధేశ్యామ్ మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం విశ్వవ్యాపితమైందన్నారు. కళలకు భాషా, ప్రాంతీయ భేదాలుండవని చెబుతూ అన్ని మెళకువలను నేర్చుకొని నృత్య రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కళలకు కాణాచి అయిన ఓరుగల్లులో దశాబ్దంన్నర కాలంగా వందలాది చిన్నారును నాట్యరంగంలో తీర్చిదిద్దుతున్న కుండె అరుణరాజ్‌కుమార్‌ను ఆయన ప్రశంసించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతో పాటు ఇతర కళారంగంలోనూ ప్రోత్సహించాలన్నారు. బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ కళాకారులుగా రాణిస్తూ భవిష్యత్ కళాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు. వందలాది మంది నాట్య కళాకారులను తయారు చేస్తున్న అరుణ అభినందనీయురాలన్నారు.

ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ సహాయ సంచాలకురాలు రాయల సునిత, చక్రవర్తి హాస్పిటల్స్ డాక్టర్ తరుణ్, సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు సీతాల రఘువేందర్, కిట్స్ సూపరింటెండెంట్ పొట్లపల్లి ప్రసాదరావు, మేకల రమేష్, రోజా క్రియేషన్స్ ఆలేటి శ్యాంసుందర్, పెండెం వేణుమాధవరావు, టి. నరేందర్, పెరుమాండ్ల వెంకట్, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణరాజ్‌కుమార్ స్వాగతం పలికారు. తొలుత ఈ వేడుకలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నా తల్లే నా దైవం శీర్షికన ప్రారంభమైన వేడుకల పరంపరంలో కుండె కొమురమ్మను ఎమ్మెల్యే రేవూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం విద్యార్థినులు శ్రీకృష్ణ రమణీయం, శివతాండవం లాస్యం లాంటి అనేక నృత్య రూపకాలు, నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

హైకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తాం..

అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ నేతలకు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్షపార్టీల శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న నీచచరిత్ర బీఆర్ఎస్‌ది అని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 32 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని ఏ ఒక్కరు వారిలో డిస్ క్వాలిఫై కాలేదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని, రాజీనామాలు చేయకుండానే తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి మంత్రులయ్యారని గుర్తు చేశారు. పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ సిగ్గులేకుండా మాట్లాడుతుందన్నారు. హైకోర్టు తీర్పుతో లొట్టపెట్ట పెదవులకు నక్క ఆశపడ్డట్లుగా కొందరు ఉప ఎన్నికలు వస్తాయని మాట్లాడుతున్నారని వారి అజ్ఞానానికి జాలిపడుతున్నానని తెలిపారు. ఎవరు ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఉప ఎన్నికలు రావని తేల్చి చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ తమకు అందలేదని కేవలం పత్రికల్లో చూశామని తెలిపారు. తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ అందిన తరువాత విషయమై పార్టీ పెద్దలతో, న్యాయ నిపుణులతో చర్చించిన తరువాత భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో, ప్రస్తుతం హైకోర్టు, సుప్రీంకోర్టులు రెండు భిన్నమైన తీర్పులు ఇస్తున్నాయన్నారు. కోర్టులను గౌరవించే బాధ్యత తమకుందన్నారు. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామన్నారు. ఏమో అయినట్లు ఎన్నికలు వచ్చినట్లు కొందరు బీఆర్ఎస్ నాయకులు ఆశపడుతున్నారని ఎద్దేవా చేశారు. కొందరు పగటి కలలు కనడం వారి అజ్ఞానికి, దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విమర్శకుల నోళ్లు మూయించేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాయకులు అంబటి కిషన్‌రాజు, జీడి రమేష్, బూర్ల శంకర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, కొంతం శ్రీనివాస్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ కమిటీల్లో మానుకోటకు ప్రాధాన్యం

ఎస్టిమేట్స్, పబ్లిక్ అకౌంట్స్ సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు అవకాశం



ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంచనాల కమిటీ, తెలంగాణ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ల్లో మహబూబాబాద్ జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఆయా కమిటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిథ్యం దక్కింది. ఆయా కమిటీల్లో సభ్యులుగా జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కోరం కనకయ్యకు చోటు లభించింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో పబ్లిక్ అకౌంట్స్, ఎస్టిమేట్స్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలను ఏర్పాటు చేస్తూ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కమిటీలో చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఉంటారు. ఇందులో తెలంగాణ ఎస్టిమేట్స్ (అంచనాల) కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో పాటు జిల్లాలోని తొర్రూరు పెద్దవంగర ప్రాతినిధ్య మండలాల పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, బయ్యారం, గార్ల మండలాల ప్రాతినిధ్య ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు అవకాశం దక్కింది. మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా నలుగురు ప్రజాప్రతినిధులకు అవకాశం లభించడం విశేషం.

ఎంజీఎం ఉద్యోగిపై దాడి ఘటనలో మహిళ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుమలతపై ఇనుప గొలుసుతో దాడి చేసి గాయపరిచి డబ్బులను బలవంతంగా లాక్కున్న రాజమ్మను మంగళవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. బిల్ల సుమలత 15 ఏళ్ల నుంచి ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండేళ్ల నుంచి పేషెంట్ కేర్ విభాగంలో పని చేస్తోంది. ఈనెల 9న విధుల్లో భాగంగా ఎంజీఎం బయోమెట్రిక్ మిషన్ వద్ద సుమలత వేలిముద్ర వేస్తుండగా ఆలకుంట రాజమ్మ అడ్డుకొని రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపేస్తానని బెదిరించింది. ఆపై ఇనుప గొలుసుతో సుమలతపై దాడి చేసి గాయపరిచింది. తర్వాత ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని పగలగొట్టి, ఆమె వద్ద ఉన్న రూ.10వేలు లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం రాజమ్మను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ.వేయి నగదు, ఇనుప గొలుసును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 10: ఎంజీఎం ఆస్పత్రిలో సుమలత అనే ఉద్యోగిపై జరిగిన ఘటనకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమలతపై దాడిచేసిన రాజమ్మ అనే మహిళ.. గతంలో ఎంజీఎంలో విధులు నిర్వహించినప్పటికీ తనపై ఉన్న అభియోగాలవల్ల విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మళ్లీ వైద్యుల పట్ల కానీ, వైద్య సిబ్బంది పట్ల కానీ ఇలాంటి ఘటనలకు పాల్పడితే రౌడీషీట్ నమోదు చేయాలని సంబంధిత అధికారును ఆదేశించారు.

చెరువులలో గుర్రపుడెక్కను తొలగించాలి



అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 10: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులలో గుర్రపుడెక్కల ఆకులు నిండి ఉన్నాయని, గణపతి నిమజ్జనానికి గుర్రపుడెక్కల ఆకులతో అసౌకర్యంగా ఉంటుందని చిన్నవడ్డెపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. గణేశ్ నిమజ్జనం చేసే చెరువులలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి మురిగిపోవడంవల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ప్రధానంగా దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, భద్రకాళి చెరువు, బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఖిలావరంగల్ మాల అగర్తల చెరువు, కాజీపేట బంధం చెరువులలో చెరువులు కలిపించకుండా గుర్రపుడెక్కల చెట్లు మొలిచాయన్నారు. గుర్రపు డెక్కల వల్ల వాతావరణంతో కలుషితం ఏర్పడుతోందని, వెంటనే చెరువుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో పెరుమాళ్ల లక్ష్మణ్, పోతన వెంకటేశ్వర్లు, బత్తుల మల్లికార్జున్ ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2910	2805
పల్లికాయ (సూక)	6420	4500
పల్లికాయ (పచ్చిది)	4450	3400
కందులు	8852	6750
పెసళ్లు	8000	4552
పత్తి	7700	5500
పసుపు (కాడి)	13489	10000
పసుపు (గోల)	12424	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	16000	13000
యూఎస్341 ఏసీ	14800	11000
దేశీ ఏసీ	....	....
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆపద వస్తే అంతేనా?

(5వ పేజీ తరువాయి)

3గంటల వరకు ఎక్స్‌కవేటర్ యంత్రంపైనే బిక్కుబిక్కుమంటూ నిరీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆరు గురు కూలీలను సురక్షితంగా హనుమకొండ తరలించా రు. ఇక ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగులో చిక్కుని 40మందికి పైగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులు 12గంటలకు పైగా ప్రాణాలను రాత్రంతా భయంభయంగా గడిపారు. మహబూబాబాద్ జిల్లాలో మానేరు వాగులో పడి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినితో పాటు ఆమె తండ్రి మోతిలాల్ మృతిచెందారు. ఇక రాళ్లవాగులో ఐదుగురు చిక్కుకపోగా రాత్రి 11.30గంటల ప్రాంతంలో నలుగురిని సురక్షి తంగా కాపాడినప్పటికి మరొకరి ఆచూకీ లేకుండా పోయింది. 2023 జూలై 27వ తేదీ వరదలకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు నీట మునిగాయి. 200కి పైగా కాలనీలల్లో ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఏటా వరంగల్ నగరంలో వస్తున్న వరదలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. విపత్తుల నుంచి ప్రజలకు సకాలంలో సహాయం అందటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్ కేంద్రంగా ఎన్డీఆర్ఎఫ్ వచ్చేనా?

ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎస్డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసింది. అగ్నిమాపక దళంలోని చురుకైన 100మంది ఉద్యోగులను ఎంపిక చేసి శిక్షణ కూడా ఇస్తుంది. ఈ ఎస్డీఆర్ఎఫ్ హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తుండటంతో వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఏటా వరంగల్‌నగరంతో పాటు గోదావరితీరంలోని ములుగు, భూపాలపల్లి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో ఏదో ఒక విపత్తు ఎదురవుతూ ఉంటుంది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు కూడా వరంగల్ కేంద్రంగా ఎన్డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా ఈ జిల్లాల్లోనే విపత్తులు సంభవిస్తుండటంతో ప్రభుత్వం ఎన్డీఆర్ఎఫ్‌కు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను మామునూరు 4వ బెటాలియన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్లు పని చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ వరంగల్‌లో ఎన్డీఆర్ఎఫ్ ఏర్పాటుకు చొరవ చూపాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

ఉద్యోగులకు వేతనం ఇవ్వడానికి జేఏసీ నాయకులు ఎవరు?

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూలవేతనం కట్ చేసి సీఎం సహాయ నిధికి ఇస్తామనడానికి జేఏసీ నాయకులు ఎవరని రెవెన్యూ ఉద్యోగుల నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రశ్నించారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఏనాడు ప్రస్తావించని ఈ జాక్‌లు.. రూ.100కోట్లు ఇస్తామని ఒకరు, రూ.130 కోట్లు ఇస్తామని ఇంకొకరు ఎవరికి వారే ప్రకటించడం కిందిస్థాయి ఉద్యోగులను కించపరచడమే అన్నారు. జాక్‌లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం సహాయనిధికి తమకు చేతనంత సహాయం తమ సంఘం తరుపున చేస్తామన్నారు. అదే విధంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి అన్నివిధాలుగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా కృషిచేస్తామన్నారు.

చాకలి ఐలమ్మ పోరాటం మరువలేనిది


కడవెండిలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రామస్థులు


కొడకండ్లలో.. ఐలమ్మకు నివాళి


తాటికొండలో నివాళులు అర్పిస్తున్న సుధీర్‌రెడ్డి


రఘునాథపల్లి : ఖిలాషాపూర్‌లో..

చిలుపూర్, సెప్టెంబరు 10 : భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని సందర్భంగా మండలంలోని కృష్ణాజీగూడెంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పోలు శ్రీను, సాదం రామరాజు, భిక్షపతి పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివా ళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాటం కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బాల్నె వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, పందిళ్ల కళ్యాణి ధర్మబిక్షం, సురేష్ నాయక్, సుగుణ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కల్లు గీత కార్మికసంఘం (కేజీకేఎస్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంటమల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఉపేందర్, వెంకటేష్, ఎల్లేష్ పాల్గొన్నారు.

● దేవరుప్పుల : భూమి కోసం భుక్తికోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరు సల్పిన వీర వనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని కడవెం డిలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రజక వృత్తి దా రుల సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధి పైండ్ల వెంకటరమణ ఐల మ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం ప్రతినిధులు పైండ్ల సుధాకర్. అంజయ్య, సోమయ్య, యాకమ్మ, రాంనర్సయ్య, పలు పార్టీల నాయకులు తాటిపెల్లి మహేష్, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, సులుగూరి మహేష్, బాషిపాక కుమార్, మహ్మద్ షఫీ, మైనాల బక్కాజీ, దొంటిక మహేష్, సోంనర్సయ్య పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండలకేంద్రంలోని రజకసంఘం ఆధ్వర్యంలో అమ రవీరుల స్థూపం వద్ద మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సంద ర్భంగా ఆ సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఆమె వీరగాథలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దూదిగాని నాగరాజు, ఎల్లయ్య, సోమేష్, రెడ్డిరాజుల గురువయ్య, కొండ్రాతి ఉపేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : రజాకారులను ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విగ్రహ కమిటీ సభ్యులు అక్కిన పల్లి అంజయ్య, సత్తయ్య, వెంకటయ్య, వీరయ్య, చంద్రయ్య, రాజు, కొము రయ్య, నాయకులు నరేందర్‌రెడ్డి, రాములు, కట్టమల్లు పాల్గొన్నారు.

● పాలకుర్తి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్ర ంలోని ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్, సీపీఐ (ఎం- ఎల్) లిబరేషన్, తెలం గాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలమాలలు వవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మ డిరాజు సాంబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల నాగిరెడ్డి, బొబ్బాల అశోక్‌రెడ్డి, నవీన్, మాచెర్ల ఎల్లయ్య, నాయకులు జీడి సోమయ్య, భుజేందర్, సోమయ్య తదితరులు ఉన్నారు.

● రఘునాథపల్లి : వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరా జు అన్నారు. చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం తో పాటు మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలో సీపీఎం నాయకులతో పాటు రజక సంఘం, వివిధ సంఘాల నాయకులు మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్ర మంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, చెరుకు రాజు, ఖిలాషాపూర్ తాజా మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, మేడిపల్లి వెంకన్న, బాల్నే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

● నర్మెట : చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మండలకేంద్రంతో పాటు మచ్చుపహడ్, హన్మంతాపూర్, వెల్దండ గ్రామాలలో రజక సంఘం ఆధ్వ ర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నర్మెట రజక సంఘం అధ్యక్షుడు ప్రజ్ఞపురం అంజయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, సీపీఎం మండల కార్యదర్శి ప్రజ్ఞాపురం నర్సింహులు, నాయకులు చంద్రయ్య, కనకయ్య, యాదగిరి, నర్సింహులు, శ్రీనివాస్, సంపత్, అంజనేయులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల హాజరుశాతం పెంచాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూరు గ్రా మంలో అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణమాసం ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం బాలింత లకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించా లనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఇందుకు అనుగునంగా టీచర్లు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోనే బోజనాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కథలు చెప్పించటం, పాటలు పాడించటం లాంటి కార్యక్రమాలు చేశారు. సీడీపీవో రమాదేవి, పంచా యతీ కార్యదర్శి రూపచైతన్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గణేశుడికి నేతల పూజలు

చిలుపూర్, సెప్టెంబరు 10 : మండలంలోని మల్కాపూర్‌లో ఆర్టీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశుడి మండపం వద్ద రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఎడవెళ్ళి మాధవరెడ్డి -మణెమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి- మాధవి ద ంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ సందర్భంగా పూజారి చొల్లేటి రాజేశ్వరశర్మ వేదమం త్రాలను ఆలపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగరి రవి, రమాదేవి, నాయకమ్మ, ఆరుశ్‌రెడ్డి, ఆరాధ్యరెడ్డి, అద్యుత్‌రెడ్డి, సన్నీకుమార్ పాల్గొన్నారు.

మాదారంలో ఉచిత వైద్య శిబిరం

రఘునాథపల్లి, సెప్టెంబరు 10: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మాదారం గ్రామంలో మంగళ వారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 115 మందికి వైద్య పరీక్షలు చేయగా 16 మందికి జ్వరం వచ్చినట్లు తెలియడంతో వారికి డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహించగా, నెగిటివ్ రావడంతో జ్వరానికి సంబంధించిన మందులను వారికి అందజేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కమలహాసన్, సీహెచ్‌వో రామ్‌కిషన్, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, విష్ణువర్ధన్ రెడ్డి, పాండరి, ఏఎన్ఎంలు స్టెల్లా మేరీ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్మెటలో కార్డెన్ సెర్చ్

నర్మెట, సెప్టెంబరు 10 : నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ పార్థసారథి అన్నారు. మంగళవారం నర్మెట మండలకేంద్రంలో ఏసీపీ పార్థసారథి నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇండ్లలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవ పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలను, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. రూ. 6400 విలువ గల గుట్కా ప్యాకేట్లు, రూ. 6800 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ పార్థసారథి మాట్లాడారు. గుట్కాలు, పొగాకు పదార్థాలు విక్రయిస్తున్న ఎండి గౌస్, బుసరాజు రాకేష్‌పై, అక్ర మంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న రంగు మురళిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నర్మెట సీఐ ఎం. సాయిరమణ, ఎస్సై నగేష్, తరిగొప్పుల శ్వేత, బచ్చన్నపేట ఎస్సై సతీష్, రఘునాథ్‌పల్లి ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరావు సేవలు మరువలేనివి

చిలుపూర్, సెప్టెంబరు 10 : వరంగల్ జిల్లాకు తొలి పార్లమెం టేరియన్‌గా పెండ్యాల రాఘవరావు చేసిన సేవలు మరువలేనివని రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి అన్నారు. మంగళ వారం 37వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం, చిన్నపెండ్యాలలో రాఘవరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు యాదగిరి, లింగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పూజారి యల్లం భట్ల కరుణాకర్ శర్మ, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య, చిలు పూర్ ఆలయ మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్, గడ్డమీది సురేశ్, ఇల్లందుల హరిబాబు, తాళ్లపల్లి బొందయ్య, పాల్గొన్నారు.

నాస్ పరీక్షా సెంటర్లను తనిఖీ చేసిన ఏఎంవో

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సాధనా సర్వే (నాస్) పరీక్షా విధానాన్ని మంగళవారం జిల్లా ఏఎంఓ బి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి హైస్కూళ్లు, పీఎస్‌లలో 3,6,9 తరగతులకు నిర్వహించిన మాక్ టెస్ట్ 1 పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాస్ గ్రాండ్ టెస్ట్ నవంబర్ 19న ఉంటుందని, అప్పటి వరకు విద్యార్థులు తమ గ్రేడ్‌ను పెంచుకునేలా ప్రశ్నాపత్రం ప్రశ్నలను అభ్యాసం చే యించాలన్నారు. ఎంఎన్‌వో కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, ఆర్‌పీలు గిరి, లవన్ తదితరులుపాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రాజలింగం


టీపీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్చం ఇస్తున్న రాజలింగం

జనగామ రూరల్, సెప్టెంబరు 10: నూతన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమా ర్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్సీ నాగ పురి రాజలింగంగౌడ్ రాష్ట్ర నాయ కుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌లు మంగళవారం హైదరాబా ద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగు చ్ఛం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడు తూ టీపీపీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి ఆహ్వానించగా త్వరలో తప్పకుండా దర్శించుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

చిన్నారుల హాజరుశాతం పెంచాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. మంగళ వారం మండలంలోని కొడవటూరు గ్రామంలో అంగన్‌వాడీ కేం ద్రంలో జరిగిన పోషణమాసం ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఇందుకు అనుగునంగా టీచర్లు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా చూడా లన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోనే బోజనాలు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సీడీపీవో రమాదేవి, పంచా యతీ కార్యదర్శి రూపచైతన్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో జయంతి

ఉత్తమ ప్రతిభ కోసం మాక్ టెస్ట్‌లు

బచ్చన్నపేట, సెప్టెంబరు 10: దేశ వ్యాప్తంగా విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించే విధంగా నవంబర్‌లో నిర్వహించే పరీక్షకు ఆయా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్టు డీఈవో రాము తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పోచన్నపేట, క ట్కూరు ఉన్నత పాఠశాలలతో పాటు, ప్రైమరీ, అలీంపూర్ ఎంపీ యూపీఎస్‌లను ఆయన సందర్శించి మొదటి మాక్ టెస్ట్‌ను పరిశీలి ంచారు. 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు ఈ టెస్ట్‌లను నిర్వహిం చారు. నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి, చంద్ర శేఖర్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. దాతలను, ఇందుకు సహకరిస్తున్న ఉపాధ్యాయుడు పృథ్వీరాజ్‌ను అభినందించారు.

బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: కలెక్టర్ గ్రీవెన్‌సెల్‌కు తరుచుగా వచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికా రులు మండలంలోని నమిలిగొండలోని బెల్టు దుకాణాలపై మంగళ వారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నమిలిగొండలో తెల్లవారుజామున నుంచి అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిం చడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జీపీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సెంటర్ల సమీపంలో, ప్రభుత్వ పాఠశాల సమీప ంలో బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయించడంతో ప్రజలు, విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి మద్యంను పట్టుకున్నారని తెలిపారు. దాడుల్లో రూ 25వేల మద్యంను, ముగ్గురు బెల్టు దుకాణాల నిర్వాహులను పట్టుకొని ఎక్సైజ్ శాఖకు అప్పగిం చారని తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి అనంతరం బెల్టు దుకాణం నిర్వాహకులు రజిత, రమ, ఎల్లయ్యలను తహసీల్దార్ వెంకటేశ్వర్లు ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పాలకుర్తి, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మంగళవారం 81 కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల ంలోని 81 మంది కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ లబ్దిదారులకు మొత్తం రూ. 81, లక్షల 936 వేలు పంపిణీ చేశారు. అనంతరం సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, జల్లం కుమార్ ఉన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు..

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: అధికారులు వారి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపా రు. మంగళవారం సాయంత్రం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ రాజ్‌శాఖ అధికారులతో నియోజకవర్గ పరిధిలో చేబట్టాల్సిన, చేబట్టిన అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కడియం మాట్లాడారు. నియోజకవర్గంలో రూ 150 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేయబోతున్నట్లు పేర్కొన్నారు. సీసీఆర్ క్రింద 100 కోట్లతో, ఎంఆర్ఆర్ కింద రూ 30 కోట్లతో, ఎస్‌సీపీ కింద రూ 20కోట్లతో పనులను ప్రారంభించబోతున్నామని తెలిపారు. డీపీవో స్వరూప, ఆర్డీవో వెంకన్న, ఎంపీడీవో విజయశ్రీ, పంచాయతీరాజ్ ఎస్ఈ రఘువీ రారెడ్డి, ఈఈలు శ్రీనివాస్‌రావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

రఘునాథపల్లి, సెప్టెంబరు 10: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని ఆశ్వరావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్యారాల కావ్యశ్రీ, ముప్పిడి భవాని, కొలిపాక అన్వేష్ ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శోభన్ బాబు తెలిపారు. వరంగల్ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సికింద్రా బాద్‌లో ఈ నెల 14, 15 తేదీల లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికయిన విద్యార్థులు పాల్గొంటారు. రాష్ట్ర స్థాయికి ఎంపికయిన విద్యార్థులను ఉపాధ్యా యులు తిరుపతిరెడ్డి, యాకయ్య, పవన్ కుమార్, సీతారామ్, అనిత, రేవతి, భద్రయ్య, మనోజ, పీఈటీ రాజేందర్ అభినందించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

చిలుపూర్, సెప్టెంబరు 10 : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పల్లగుట్టలో, ఊరచెరువు దిగువన నుంచి ముసుర్లకుంట చెరువుకు వెళ్ళే మార్గంలో దెబ్బతిన్న రోడ్డును పీఆర్ డీఈ రాజగోపాల్‌రావుతో కలిసి పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలమేరకు రూ 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న లోలెవల్ కాజ్‌వే (లోలెవల్ వంతెన) నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు.

మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 10: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో మిగిలిపోయిన సీట్లకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురు కులాల జిల్లా సమన్వయాధికారి పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి తొమ్మిది తరగతుల వరకు మిగిలిపోయిన సీట్లకు ఆసక్తి గల ఎస్సీ బాలబాలికలు ఈ నెల 12వ తేదీ 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యాదాద్రి జిల్లాలోని గురుకుల విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

జనగామ రూరల్, సెప్టెంబర్ 10: అనారోగ్యంతో బాధపడుతూ హెడ్ కానిస్టేబుల్ మంగళవారం మృతి చెందిన సంఘటన జనగామ పోలీస్ స్టేషన్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. జనగామ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గండి సుందర్‌నాథ్(58) మృతి చెందాడు. గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సుందర్‌నాథ్ హైదరాబాద్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని అద్దె ఇంట్లో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ పోలీసులు, నాయకులు మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుందర్‌నాథ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుందర్‌నాథ్ పలు పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు.

నాస్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఏఎంవో

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సాధనా సర్వే (నాస్) పరీక్షా విధానాన్ని మంగళవారం జిల్లా ఏఎంవో బి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి హైస్కూళ్లు, పీఎస్‌లలో 3,6,9 తరగతులకు నిర్వహించిన మాక్ టెస్ట్ 1 పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎంఎన్‌ఓ కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్ పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు రూ.1.89లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం, సెప్టెంబరు 10: లింగాల ఘణపురం మండల తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధ ర్‌రెడ్డి గణేశ్ నవరాత్రోత్సవ వేడుకల సందర్భంగా మండ లంలోని 17 గ్రామాలకు చెం దిన 39 మండపాలకు రూ. 1.89 లక్షలు విరాళంగా అంద జేశా రు. ఒక్కో మండపానికి రూ. 5వేల లెక్కన ఉత్సవకమిటీలకు విరాళంగా ఇచ్చినట్టు వంశీధర్‌రెడ్డి తెలిపారు.

నాయీబ్రహ్మణ సంఘం అధ్యక్షుడిగా అనిల్

నర్మెట, సెప్టెంబరు 10 : నాయీబ్రహ్మణ సంఘం నర్మెట మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకు న్నారు. మండల అధ్యక్షుడిగా నర్మెట మండలకేంద్రానికి చెందిన నిమ్మకంటి అనిల్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అరిగెల విజయ్‌కుమార్, కోశాధికారిగా నిమ్మకంటి గణేష్, ఉపాధ్యక్షుడిగా కొలిపాక బాస్కర్, సహాయ కార్యదర్శిగా నిమ్మ కంటి సంపత్, గౌరవ అధ్యక్షుడిగా నిమ్మకంటి బుగులయ్య, గౌరవ సలహా దారుడి గా నిమ్మకంటి బాలయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రఘుపతి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

బీజేవైఎం జనగామ కన్వీనర్‌గా క్రాంతి కుమార్

జనగామ రూరల్, సెప్టెంబరు 10: బీజేవైఎం జనగామ నియోజకవర్గ కన్వీనర్‌గా ఆకుల క్రాంతికుమార్‌ను నియమిస్తునట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమం త్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కాంత్రికమార్ బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై బీజేపీలో చేరడం జరిగిందన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని క్రాంతి తెలిపారు

ఘనంగా ఉపాధ్యాయులకు వీడ్కోలు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 10: ఉపాధ్యా యుల వీడ్కోలు కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహి ంచారు. మంగళవారం జనగామ మండలం వెంకి ర్యాల ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపా ధ్యాయుడు బి.శంకర్ అధ్యక్షతన ఉపా ధ్యాయుల వీడ్కోలు సమా వేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కీర్తి లక్ష్మీనర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పదోన్నతితో బదిలీ అయిన ఉపాధ్యాయులు దూడల రమేష్, నల్ల లలిత, బక్క విద్యారాణిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యా ర్థులకు బుక్స్, స్టేషనరీని అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బత్తిని చొక్కయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గర్దాసు లక్ష్మి, ఉపాధ్యాయులు రుద్రోజు మహేశ్, జ్యోతి, వినోదరాణి తదితరులు పాల్గొన్నారు.

జనగామకు నువ్వే బాస్.. డోంట్‌వర్రీ!

డీసీసీ పగ్గాలు నీవే అంటూ కొమ్మూరికి కీలకనేతల భరోసా

పలు ప్రచారాలకు, ఊహాగానాలకు చెక్ పెట్టేలా సంకేతాలు


నియోజకవర్గ ముఖ్యనాయకులతో వేం నరేందర్ రెడ్డిని కలిసిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల/జనగావ ం రూరల్ సెప్టెంబరు 10 : చేర్యాల మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి భారీ ఊరట కలిగింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు పార్టీ లో నెలకొన్న పరిస్థి తులు, అంతర్గత విభేదాలు, సంస్థా గత పరిణామాల నేపథ్య ంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పార్టీపెద్దలు కొండంత భరోసా కల్పించారు. జనగామ డీసీసీ అధ్యక్ష పదవితో పాటు ఆయనకు సముచితస్థానం పదిలమంటూ సంకే తాలిచ్చారు. కొంతకాలంగా సొంతపార్టీలోని పలువురు నేతలు చేస్తున్న ఊహాగా నాలకు తెరదించుతూ కార్యకర్తల సమక్షంలో అధిష్ఠానంలోని పలువురు కీలకనేతలు కొమ్మూరి లైన్ క్లియర్ చేయడం పట్ల ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనగామ అసెంబ్లీ ఎన్నికల్లో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటమి చెందిన అనంతరం పార్టీ స్థితిగతుల దృష్ట్యా నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలు డీసీసీ అధ్యక్ష పదవినుంచి కొమ్మూరిని తొలగించాలంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో పలువురు ఆయనను ఖాతరు చేయకుండా ఎవరికి వారుగా వ్యవహ రించారు. అప్పటికే పొన్నాల వర్గంగా ముద్రబడిన వారితో పాటు ఎన్నికల పరిమాణాల అనంతరం పలువురు ఆయనకు వ్యతిరేకంగా పావులు కదుపుతూ వస్తున్నారు. గతంలో నెలకొన్న పరిచయాలతో ఆయా పనులకు సంబంధించి మం త్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో అంటకాగుతుండటంతో పాటు ఇతరత్రా నాయకులను నేరుగా కలుస్తూ కొమ్మూరిపై ఫిర్యాదులు చేస్తున్నారు. ఇన్‌చార్జ్ పదవిని తొలగించాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్న క్రమంలో సొంతపార్టీ నాయకులే పదవి మార్పుపై ప్రచారం చేస్తున్న క్రమంలో ఆయన తనదైనశైలిలో చక్కబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ నియామక మవగా, నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు నేరుగా కలిసి అభ్యర్థించారు. అందుకు చెక్ పెడుతూ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగా మ పరిధిలోని ఇతర మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను వెంటబెట్టుకుని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులపై కార్యకర్తల సమక్షంలోనే చర్చించారు. ఈ క్రమంలో 'జనగామకు నువ్వే బాస్‌వి.. ఏం అందోళన పడొద్దు. అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతం కోసం పాటుపడాలి' అని మంత్రి పొంగులేటి, 'డోంట్ వర్రీ.. పార్టీ అండగా ఉంది. మంచిగా పని చేసుకో' అంటూ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అటూ ఇటూ ఎటూ వెళ్లకుండా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలోనే పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కొంతసేపు ముచ్చటించడంతో కొమ్మూరికి ఇక ఢోకా లేదంటూ కార్యకర్తలు జోష్‌లో మునిగిపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.